సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 13 । జూలై । 2025



అరచేతిలో 'నా పంచాయతీ'
కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మేరీ పంచాయతీ యాప్‌తో అభివృద్ధి పనులు, నిధుల వినియోగం తెలుసుకోవచ్చు.
8లో▸



వరదనీటితో ముప్పు
9లో▸
ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పత్తి, సోయా, కంది సాగుచేసిన రైతులు పంటలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతు న్నారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.3/26.3
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోత పెరుగుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిబంధనలకు విరుద్ధంగా వైద్యంచేస్తే చర్యలు



క్లినిక్ సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో

బోథ్: నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని పొచ్చర సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌ను గుర్తించి సీజ్ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న వైద్యం అర్హతకు మించి ఉందని, ప్రజల ప్రాణాలకు ప్రమాదమన్నారు. ఆర్‌ఎంపీలకు కేవలం ప్రాథమిక చికిత్సకు మాత్రమే అనుమతులున్నాయని, డాక్టర్ అనిపించుకునే హక్కు లేదన్నారు. ప్రజలు అర్హత గల ఎంబీబీఎస్ వైద్యుల వద్దే వైద్యం చేయించుకోవాలన్నారు. ఆయన వెంట మలేరియా అధికారి డాక్టర్ ఎం.శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ రెడ్డి ఉన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31 వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఉమ్మడి జిల్లా పరిధిలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలి



మాట్లాడుతున్న పూసం సచిన్


ఆదిలాబాద్‌అర్బన్: జనగణనలో ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. శనివారం పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరంలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాలకు తెలంగాణ నుంచి హాజరయ్యారు. ఆదివాసీలు అస్తిత్వ, సంప్రదాయం, గోండి ధర్మ, ప్రకృతి ఆరాధకులుగా ఉన్న వారికి జనగణనలో పత్యేక మతానికి సంబంధించి కాలం కేటాయించకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. కుమురం భీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఫార్రెస్ పేరిట తీసుకొచ్చిన జీవో 49 రద్దు చేయాలన్నారు. అటవీ సంపద కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

ఆర్టీఐ పేరిట అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సమాచార హక్కు చట్టాన్ని (ఆర్‌టీఐ) అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన వారిపై ఇదివరకు రెండు కేసులు నమోదు చేశామన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సోమ రవి, డీపీఆర్ ఆంజనేయులుపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాన్ని బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన షేక్ యూసఫ్, ఎండీ అర్షద్, షేక్ సమద్‌పై టూటౌన్‌లో ఇటీవల కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆర్‌టీఐ సమాచారం అత్యధికంగా సేకరించిన వారిపై ప్రత్యేక బృందం ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.



జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి, ఎంపీ అనిల్ కుమార్ (ఫైల్)

డీసీసీ.. హీట్..!

'జిల్లా అధ్యక్షుడి ఎంపికలో అందరి ఆమోదం తీసుకోవాలి.. ఏకపక్షంగా నిర్ణయం ఉండరాదు.. అందరూ సూచించిన నాయకుడినే ఎంపిక చేయాలి.. జనబలం ఉండాలి.. కొంతమంది వద్ద దబ్బు ఉంటుంది కానీ, కార్యకర్తల అండ ఉండదు.. ఎవరు ఏమీ అనేదీ మాకు తెలుసు.. కొంతమంది వ్యవహారశైలి వల్లే సీతక్క వేరే జిల్లాకు వెళ్లిపోయింది.. ఆమెను అడిగినా జిల్లా నాయకుల వ్యవహారశైలి తెలిసి పోతుంది.. కార్యకర్తలు ప్రతిపాదించే పేరునే ఎంపిక చేయాలి.. లేనిపక్షంలో నేను ఎక్కడికి పోవాలో అక్కడికి వెళ్తాను.. నాకు కూడా మార్గాలు ఉన్నాయి..' ఈ మాటలన్నీ అన్నది ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు.. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ఈ మాటలు అన్నారు.. అదీ కూడా పార్టీ సంస్థాగత జిల్లా ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ ఎదుట.. ప్రస్తుతం పార్టీలో ఈ వ్యాఖ్యలు చర్చనీయంగా మారాయి.

- అధ్యక్షుడి ఎంపికపై ఉత్కంఠ
- ప్రాధాన్యత సంతరించుకున్న ఎమ్మెల్యే బొజ్జు వ్యాఖ్యలు
- సమీకరణాల నేపథ్యంలో ఎవరికి దక్కనుందోననే చర్చ
- హస్తం పార్టీలో ఆసక్తికరంగా పరిణామాలు

సాక్షి, ఆదిలాబాద్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎంపికకు ముహూర్తం దగ్గరపడుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో డీసీసీ అధ్యక్షుడు ఎవరు అనేది నిర్ణయం జరుగుతుందని పార్టీలో చెప్పుకుంటున్నారు. తుదిదశకు ఈ ప్రక్రియ రాగా ఎంపిక కోసం పరిశీలనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి సమక్షంలోనే ఎమ్మెల్యే బొజ్జు ఈ వ్యాఖ్యలు చేయడం, ఆయన జిల్లా నేతల్లో ఎవరిని విభేదిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారోనని పార్టీలో నలుగురు కలిసిన ప్రతీచోట చర్చించుకుంటున్నారు.

ఆత్రం సుగుణ వర్గం గురించేననీ..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో గతంలో పార్లమెంట్ ఎన్నికలు, ఆతర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలు కావడంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత హైదరాబాద్ గాంధీభవన్ స్థాయిలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో ఈ పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనేతలతో పలు సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల్లోనే జిల్లాలో గ్రూపు తగదాల కారణంగా పార్టీ ఓటమిపాలైందని, గ్రూపులకు కొంతమంది నేతల వ్యవహారశైలే కారణమని మీనాక్షి సమక్షంలోనే పలువురు ప్రస్తావించారు. కాగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఉన్న ఆత్రం సుగుణ మధ్య కొంతకాలంగా విభేదాలు చోటు చేసుకుని వార్ కొనసాగుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీచేసిన ఆత్రం సుగుణ ప్రధానంగా తన ఓటమికి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్యమైన నాయకులు సహకరించకపోవడంతోనేనని అప్పట్లో ఆరోపణలు చేశారు. అప్పటి నుంచే ఈ ఇద్దరు ముఖ్య నాయకుల మధ్య తగదా మొదలైంది. ఇద్దరు ఖానాపూర్ నియోజకవర్గానికే చెందిన ఎస్టీ నేతలే కావడంతో భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో ఉంచుకునే ఈ వార్ జరుగుతోందని పార్టీలో చర్చ సాగుతుంది. తాజాగా మళ్లీ జిల్లా అధ్యక్షుడి ఎంపికలో ఈ వివాదం తీవ్రస్థాయిలో జరుగుతోంది. ఆత్రం సుగణ తన వర్గానికి చెందిన నాయకుడికి అధ్యక్ష పదవి ఇప్పించే విషయంలో ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆ ప్రక్రియను విభేదిస్తూ ఈ వ్యాఖ్యలు చేసారని చెప్పుకుంటున్నారు.

తుదిదశకు వచ్చినట్టేనా..

ప్రధానంగా పార్టీ పరంగా పరిశీలకులు పట్టణం, మండలం వారీగా సమావేశాలు నిర్వహించి ఇటు బూత్ స్థాయి నుంచి మొదలుకుంటే గ్రామ, మండల, బ్లాక్ స్థాయి కమిటీల నియామకం కోసం విస్తృతంగా పర్యటించారు. ప్రతీ కమిటీకి సంబంధించి ఐదేసి పేర్లను సేకరించి అధిష్టానానికి పంపించారు. ఇక ఈ కమిటీల నియామకం జరుగుతుందనే దశలో వేరువేరు జిల్లాలతో పాటు మన జిల్లాలోనూ వివాదం నెలకొనడంతో ప్రక్రియ అలాగే నిలిచిపోయింది. దీంతో ఇప్పటి వరకు ఏ ఒక్క కమిటీ కూడా నియామకం కాలేదు. తాజాగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఈ కమిటీల ఏర్పాటు విషయంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోనే ఉమ్మడి జిల్లాలకు ఇద్దరేసి ఇన్‌చార్జీలను నియమించి ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, జిల్లా కమిటీలను కూడా 15వ తేదీ తర్వాత ఎప్పుడైనా పూర్తి చేసేలా ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకోవాలని ఆమె నిరంతరం వారితో జూమ్ సమావేశంలో మాట్లాడుతూ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ జిల్లాకు రావడం జరిగింది. ఇక కమిటీలను ప్రకటించడమే తరువాయి అని పార్టీలో చెప్పుకుంటున్నారు. జిల్లా కమిటీ కూడా ప్రకటించడంతో పాటు డీసీసీ ఎవరనేదీ కూడా తేల్చేయనున్నట్లు చర్చ సాగుతోంది. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో ఈ అధ్యక్షుల ఎంపిక పరంగా సామాజిక సమీకరణలను ప్రధానంగా తీసుకుని ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు సంబంధించి మాత్రం జనరల్ కేటగిరీలో ఎవరినైనా అధ్యక్షుడిగా నియమించవచ్చని అంటున్నారు. ఇలా ప్రక్రియ తుదిదశకు రాగా తాజాగా ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా

సాత్నాల: విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని, పుస్తక పఠనమే భవిష్యత్‌లో అగ్రగణ్యులుగా నిలుపుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భోరజ్ మండలం పిప్పర్‌వాడలోని అభ్యుదయ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కవి బి.మురళీధర్ రచించిన 'మౌనం ఎరుపు' పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించగా ఇటీవల హిందీలోకి అనువాదమైన మోర్ పంకిపేడ్ పుస్తకాన్ని పాఠశాల యాజమాన్య సభ్యులు రాధాకృష్ణ, వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పఠనాసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. నేటి ఆధునిక ప్రపంచంలో డిజిటలైజేషన్ ద్వారా ఎన్నో రకాల సాహిత్యం, రచనలు అందుబాటులోకి వచ్చినప్పటికీ భౌతికంగా ఒక పుస్తకాన్ని చేతిలోకి తీసుకొని చదివేటప్పుడు కలిగే అనుభూతి అనిర్వచనీయమన్నారు. జిల్లా సంస్కృతి, భౌగోళిక విశిష్టతను ప్రతిబింబించే సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. పీఎం శ్రీ పాఠశాలల్లో ప్రత్యేక గ్రంథాలయాలు ఏర్పాటు చేసి జిల్లా కవుల రచనలు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రముఖ నవలా రచయిత వసంత్రా దేశ్‌పాండే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుస్తక రచయిత బి.మురళీధర్, విజయ డెయిరీ జనరల్ మేనేజర్ మధుసూదన్‌రావు, అభ్యుదయ పాఠశాల యాజమాన్య సభ్యులు సర్పన్ వెంకట్‌రెడ్డి, రచయితలు రాజవర్ధన్, మన్నె ఏలియా, చిందం ఆశన్న, చరన్‌దాస్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో కేంద్ర బృందం పర్యటన



మున్సిపల్ అధికారులతో టీయూఎఫ్ఐడీసీ బృందం సభ్యులు

కైలాస్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధితో పాటు ఆదాయ వనరులను పెంపొందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'అర్బన్ చాలెంజ్ ఫండ్ స్కీం' కింద ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఎంపికైన విషయం తెలిసిందే. పథకం కింద టీయూఎఫ్ఐడీసీ ద్వారా మున్సిపాలిటీకి రూ.900 కోట్ల నిధులు కేటాయించనున్నారు. ఈ నిధులతో పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టవచ్చు, పట్టణ ఆదాయాన్ని ఏ విధంగా పెంచుకోవచ్చని అధ్యయనం చేసేందుకు అశి పాల్, ఎస్.వినయ్‌కాంత్‌లతో కూడిన ఇద్దరు సభ్యుల బృందం శనివారం ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో పర్యటించింది. కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు, వాకింగ్ ట్రాక్ వంటి ఇతరాత్ర వసతులను కల్పించేందుకు వీలుగా పట్టణంలోని పాత జాతీయ రహదారితో పాటు ప్రధాన చౌక్‌లు, ఖానాపూర్ చెరువు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, గాంధీ పార్కు, నేతాజీచౌక్, ఖుర్షీద్‌నగర్‌లోని మున్సిపల్ లీజు స్థలాలను పరిశీలించారు. అంతకు ముందు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును కలిసి పట్టణంలోని వార్డులు, జనాభా, ప్రాపర్టీ ట్యాక్స్, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయం వంటి సమగ్ర సమాచారం సేకరించారు. నివేదికను కేంద్ర పట్టణాభివృద్ధిశాఖకు అందించనున్నారు. కార్యక్రమంలో ఎంఈ పేరిరాజు, డీఈ కార్తీక్, టౌన్ ప్లానింగ్ అధికారులు సుమలత, నవీన్ కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.నరేందర్ పాల్గొన్నారు.

ప్రతీ కేసులో సీఐ స్థాయి పర్యవేక్షణ ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీ కేసులో సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శనివారం సర్కిల్ అధికారితో కోర్టు డ్యూటీ అధికారులు సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. కోర్టుకు హాజరు కాని నిందితులకు నాన్‌బెయిల్ వారెంట్ వచ్చేవిధంగా చూడాలన్నారు. కేసుల దర్యాప్తు పురోగతిపై పర్యవేక్షించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కోర్టు డ్యూటీ అధికారులకు నగదుతో పాటు ప్రశంస పత్రాలు అందజేస్తామన్నారు. నేరస్తులకు శిక్ష పడుతున్న సందర్భంలో సమాజం సన్మార్గం వైపు పయనించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కోర్టులో శిక్ష పడే విధంగా కృషి చేయాలన్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో దర్యాప్తు చేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలతో జిల్లా కేంద్రంలోని హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీలైనంత వరకు కేటాయించిన కేసుల్లో సక్రమంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. పార్ట్-1, పార్ట్-2, సీజర్, పంచనామాలు నిర్వహించి దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు ప్రేమ్‌కుమార్, గుణవంత్‌రావు, అంజమ్మ, కోర్టు లైజన్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పూలే దంపతుల స్ఫూర్తితో రాణించాలి



విద్యార్థినులను సత్కరిస్తున్న నేతలు

ఆదిలాబాద్‌రూరల్: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల స్ఫూర్తితో విద్యార్థులు చదువులో రాణించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల పూలే విశ్రాంతి భవనంలో పదోతరగతిలో టాపర్స్‌గా నిలిచిన మాలీ సామాజిక వర్గానికి చెందిన తాంసి మండలం కప్పర్ల హైస్కూల్ విద్యార్థిని దారట్ల కీర్తిలయ, తలమడుగు మండలం కుచాలాపూర్‌కు చెందిన సెండే సమీక్షను సత్కరించి నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ గురునులే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురునులే, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ ఉమేష్ రావు డోలే, మాలీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అంబేకర్, పట్టణ అధ్యక్షుడు శ్రీను ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేసి తీరుతాం

- వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- పర్యాటకంగానూ తీర్చిదిద్దుతాం
- మంత్రులు కొండా సురేఖ, వివేక్
- బాసర ఆలయంలో ప్రత్యేక పూజలు
- ధర్మశాల పునరుద్ధరణ ప్రారంభం
- ట్రిపుల్‌ఐటీ కళాశాల సందర్శన



టీటీడీ గదుల ధర్మశాల పునరుద్ధరణకు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రులు సురేఖ, వివేక్, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల



బాసర ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రులు సురేఖ, వివేక్, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు

భైంసా/బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతీ ఆలయాన్ని నభూతో న భవిష్యత్ అన్న రీతిలో అభివృద్ధి చేసి తీరుతామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. శనివారం కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ సరస్వతీ అమ్మవారి ప్రాశస్త్యాన్ని వివరించారు. బాసర అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేశామని చెప్పారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదంతో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. బాసర ఆలయ అభివృద్ధికి అవసరమై కేంద్రం నిధులు రాబట్టేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీల సహకారం తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతోనూ చర్చించి పర్యాటకంగా బాసర క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులిచ్చి అందులో రూ.8 కోట్లే ఖర్చు చేసి మిగతా వాటిని వెనక్కి తీసుకుందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం వెనక్కి వెళ్లిన నిధులు విడుదల చేయాలని కోరారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను నాలుగు భాగాలుగా కేటాయించి రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్, దేవాదాయ శాఖ అధికారులు ప్రదర్శించారు. మొదటిభాగంలో అమ్మవారి ఆలయ విస్తరణ, క్యూకాంప్లెక్స్‌లు, గర్భగుడి విస్తరణ, చుట్టూ ప్రాకారాల నిర్మాణాలు ప్రదర్శించారు. పక్కనే గుట్టపై మరో వంద గదుల సత్రం, 300 కార్లు నిలిపేలా పార్కింగ్ స్థలంతో నమూనాను సిద్ధం చేశారు. రెండవ ప్రదర్శనలో బాసర గోదావరినదికి వెళ్లే మార్గంలో అమ్మవారి ఆలయానికి సంబంధించిన ఎనిమిది ఎకరాల్లో 50 అడుగుల సరస్వతీ ఆలయం, లేజర్ ప్రదర్శన, భక్తులు సేద తీరేలా డార్మెంటరీ నిర్మాణం చేపట్టేలా, రాత్రి వేళ ప్రదర్శనలు ఇచ్చేలా నమూనాలు రూపొందించారు. ఇక అమ్మవారి ఆలయానికి ఆదాయం వచ్చేలా ఓ కన్వెన్షన్ హాల్ నిర్మించేలా ప్రతిపాదించారు. పలు ప్రైవేట్ కంపెనీల సమావేశాలు, వివాహాలు, శుభకార్యాల నిర్వహణపై వచ్చే ఆదాయం పెరిగేలా నమూనా వేశారు. మూడో ప్రదర్శనలో బాసర గోదావరినది తీరంలో అమ్మవారి ఆలయానికి సంబంధించి మరో 20 ఎకరాలకుపైగా భూములున్నాయి. ప్రస్తుతం నది ఒడ్డునే పిండ ప్రదానం, పక్కనే శివాలయం, అటు పక్కనే అల్పహారాల విక్రయ కేంద్రాలు కనిపిస్తుంటాయి. అలా కాకుండా పిండ ప్రదానాలకు వేరే చోట నిర్మాణాలు, శివాలయాన్ని విస్తరించడం, సువిశాలంగా ఉన్న స్థలాన్ని అందంగా తీర్చిదిద్దితే గోదావరి నది దృశ్యాలు ఆహ్లాదం పంచేలా నిర్మాణాలు చేపట్టే నమూనాను వివరించారు. నాలుగో ప్రదర్శనలో బాసర రైల్వేస్టేషన్ సమీపంలో ఆలయానికి సంబంధించిన భూమిలో సిబ్బంది, ఉద్యోగులకు వసతి సౌకర్యంతోపాటు భక్తులకు విశ్రాంతి భవనం నిర్మించేలా నమూనా రూపొందించారు. ప్రైవేట్ వాహనాలు నిలిపి భక్తులను అమ్మవారి క్షేత్రానికి తరలించేలా.. ఆన్‌లైన్‌లో వెహికిల్ బుకింగ్ చేసుకునేలా కౌంటర్లు ఏర్పాటు చేయాలని నమూనాలో వివరించారు. రైలు మార్గం ద్వారా వచ్చే భక్తులు అక్కడే విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఇందులో చర్చించారు.

నిరాహార దీక్షకు దిగుతా..

బాసర అమ్మవారి ఆలయ అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ అమలుపై తమకు మళ్లీ నిరాశే మిగిలిందన్నారు. ఆలయ గర్భగుడి, ఇతర అభివృద్ధి పనుల విషయంలోనూ ప్రభుత్వంతోపాటు మంత్రులను పలుసార్లు కలిశానని, అసెంబ్లీలోనూ ప్రస్తావించానన్నారు. వచ్చే దసరా, దీపావళి వరకైనా నిధులిచ్చి అభివృద్ధి చేయాలని కోరారు. లేని పక్షంలో తాను అమ్మవారి ఆలయం ఎదుట నిరాహార దీక్షకు దిగుతానని తెలిపారు. ప్రభుత్వం నిధులివ్వకుంటే భిక్షమెత్తైనా ఆలయాన్ని బాగు చేసుకుంటామని చెప్పారు. ఆలయానికి బెంగళూర్‌కు చెందిన ఓ దాత రూ.4 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ప్రకటించారు.

ట్రిపుల్‌ఐటీలో మొక్కలు నాటి..

వనమహోత్సవంలో భాగంగా బాసర ట్రిపుల్‌ఐటీలో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మొక్కలు నాటారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ బాసరలో ట్రిపుల్‌ఐటీ నెలకొల్పడంతోనే ఇప్పుడు వేలాది మంది విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. సమస్యలపై కలెక్టర్ నివేదిక పంపితే సీఎంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్‌ఐటీ అభివృద్ధికి నిధులివ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్, ఎస్పీ జానకీ షర్మిల, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావుపటేల్, వేణుగోపాలాచారి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మహాధర్నాకు వెళ్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఆదిలాబాద్‌అర్బన్: ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థ రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఔట్ సోర్సింగ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీను అన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాలో పాల్గొనేందుకు శనివారం ఉదయం సంఘం నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ ఇవ్వాలని, మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఉద్యోగి మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెళ్లిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామగిరి సంతోష్, పుల్లూరి రవి, దాసు జ్ఞానేందర్, తోట రాజు, శైలేందర్, రవికిరణ్ యాదవ్, రాహుల్, విజయ్, ఓంకార్, సాయి కృష్ణ, సాయి, ఆశీష్, వేణు, అక్షయ్, శ్రీనివాస్, పవన్, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ మండలంలోని పెండల్వాడ గ్రామానికి చెందిన మన్నె సుజాత (22) అదృశ్యమైంది. తండ్రి పొచ్చిరాం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం అక్కడి పోలీసులు కేసును టూటౌన్‌కు బదిలీ చేశారు. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సుజాత మరో మహిళతో కలిసి ఈనెల 7న బస్సులో ఆదిలాబాద్ బస్టాండ్‌కు చేరుకుంది. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో కాలకృత్యాల కోసం వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించిన ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై శనివారం కేసు నమోదైంది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్, టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాలు.. అశోక్‌రోడ్ ఏరియా కుమార్‌పేటలో తోట పరమేశ్వర్, భాగ్యనగర్ కాలనీలో అంగుళ్వార్ శ్రీకాంత్‌లు అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారు. ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి పరమేశ్వర్ నుంచి 2.2 లీటర్ల మద్యం, శ్రీకాంత్ నుంచి 6 లీటర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


సురేందర్(ఫైల్)

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన పవార్ సురేందర్ (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సురేందర్ తాపీమేస్త్రి పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్ రాడ్‌కు చీరతో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి సుమన్‌బాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్త అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: తలమడుగు పోలీస్‌స్టేషన్ పరిధి బరంపూర్ శివారు ప్రాంతంలో రెండు రోజుల క్రితం భార్య సుహాసిని ఆత్మహత్యకు కారకుడు భర్త దేవిశ్రీ ప్రసాద్ తేలింది. శనివారం భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు.



ఈ చిత్రంలో ఉన్నది రైతు మడే అక్షంత రావు. పెంచికల్‌పేట్ మండలం నందిగామ గ్రామశివారులో నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నదికి వరద పోటెత్తడంతో నాలుగెకరాల పత్తి నీట మునిగింది. సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లింది. తిరిగి పత్తి విత్తనాలు విత్తుకునే పరిస్థితి లేదని వాపోయాడు.



ఈ చిత్రంలో ఉన్నది రైతు దగె అంకులు. గతేడాది ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఎకరాకు సుమారు రూ.20 వేల పెట్టుబడి పెట్టాడు. గతేడాది వర్షాలతో దిందా గ్రామం సమీపంలోని వాగుకు వరద లొచ్చాయి. ప్రాణహిత నది ముంపు నీటిలో పత్తి మునిగింది. వారం రోజులకు పైగా వరద నీటిలో ఉండడంతో మొక్కలు కుళ్లిపోయాయి. సుమారు రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లింది. అధికారులు పంట నష్టం సర్వే నిర్వహించినా పరిహారం అందించలేదు.

వరద తగ్గింది.. బురద మిగిలింది


వరదలో మునిగి కుళ్లిపోయిన పత్తి మొక్కలు

- పంటలను ముంచిన ప్రాణహిత
- ఆదిలోనే అన్నదాత ఆశలను తుంచిన వరద
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో వేల ఎకరాల్లో పంట నష్టం
- మళ్లీ విత్తనాలు విత్తుకోవాల్సిందే..
- ఏటా నష్టపోతున్నా.. అందని పరిహారం


పెంచికల్‌పేట్ మండలం నందిగామ శివారులో నీట మునిగిన పత్తి చేనులో రైతు

చింతలమానెపల్లి/పెంచికల్‌పేట్/వేమనపల్లి: వానాకాలం ప్రారంభంలోనే ప్రాణహిత నది వరదలు కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల రైతుల పంటలను నాశనం చేశాయి. పత్తి మొక్కలు మొలకెత్తుతున్న తరుణంలో వచ్చిన ఈ వరదలు వేలాది ఎకరాల పంటలను తుడిచిపెట్టాయి. గత నాలుగేళ్లుగా ఇలాంటి వరదలతో నష్టపోతున్న రైతులు, అప్పుల భారంతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు. ఈ కథనం ద్వారా వరదల ప్రభావం, రైతుల నష్టాలు, పరిహారం కోసం వారి ఆవేదనను వివరిద్దాం.

వరదలతో పంట నష్టం..

ప్రాణహిత నది ఉధృతి కారణంగా కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని నదీతీర ప్రాంతాల్లో పత్తి పంటలు నీటమునిగాయి. వేమనపల్లి, కోటపల్లి, దహెగాం, బెజ్జూర్, కౌటాల మండలాల్లో వేలాది ఎకరాల పంటలు మూడు నాలుగు రోజుల పాటు నీటిలో మునిగి కుళ్లిపోయాయి. మొలక దశలోనే ఉన్న పత్తి మొక్కలు వరదలో కొట్టుకుపోయాయి. వరద తగ్గిన తర్వాత చేలల్లో ఒండ్రు మట్టి, బురద, ఇసుక మేటలు పేరుకుని, పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. మళ్లీ పంట వేసినా వరద ముప్పు తప్పదనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

నాలుగేళ్లుగా నష్టాలే..

గత నాలుగేళ్లుగా ప్రాణహిత నది వరదలు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. అప్పులు చేసి పంట సాగు చేసిన రైతులు, నష్టాలతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. ఒక్కో ఎకరం పత్తి సాగుకు రూ.16 వేల నుంచి రూ.20 వేల ఖర్చవుతుందని, విత్తనాలు, ఎరువులు, కల్టివేటర్, కైకిలి ఖర్చులు తీర్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం, వేమనపల్లిలో 1,790 ఎకరాలు, కోటపల్లిలో 2,500 ఎకరాలు, బెజ్జూర్‌లో 1,200 ఎకరాలు, దహెగాంలో 900 ఎకరాలు, కౌటాలలో 1,800 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయింది. రైతులు సమగ్ర సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

ప్రాణహిత–పెన్‌గంగ ప్రభావం..

సిర్పూర్(టి) నియోజకవర్గంలో ప్రాణహిత, పెన్‌గంగ నదులు ప్రవహిస్తాయి. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట, దహెగాం మండలాల్లో ఈ నదుల తీర ప్రాంతాలు వరదల ప్రభావానికి గురవుతున్నాయి. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు, పెన్‌గంగ, వార్ధా తదితర నదులపై ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడం వల్ల ప్రాణహితలో నీటి ప్రవాహం పెరుగుతోంది. గోదావరిలో ఉధృతి పెరిగినప్పుడు ప్రాణహిత నది ప్రవాహం అడ్డుకోబడి, వరద నీరు నిలిచిపోతుంది. దీంతో నదిలో కలిసే వాగులు, కాలువల నీరు పరిసర భూముల్లోకి చేరి పంటలను నాశనం చేస్తోంది. ఈ వరదలు 3 నుంచి 15 రోజుల వరకు కొనసాగుతాయి.

వేలాది ఎకరాల నష్టం..

దహెగాంలో 12 గ్రామాలు, పెంచికల్‌పేటలో 8 గ్రామాలు, బెజ్జూర్‌లో 14 గ్రామాలు, చింతలమానెపల్లిలో 10 గ్రామాలు, కౌటాలలో 8 గ్రామాలు, సిర్పూర్‌లో 9 గ్రామాలు వరదల బారిన పడ్డాయి. ఈ ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోవడంతో పత్తి, వరి, ఇతర పంటలు మునిగిపోయాయి. పెంచికల్‌పేట మండలంలో మురళీగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్‌గాం గ్రామాల్లో సుమారు 400 ఎకరాల పత్తి నీటమునిగింది. గతేడాది చింతలమానెపల్లిలో 1,200 ఎకరాల్లో పంటలు నష్టపోయినా, అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ పరిహారం అందలేదు.

పరిహారం, నష్ట నివారణ చర్యల లేక..

ఏటా పంటలు మునిగినప్పటికీ, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందడం లేదు. ముంపు ప్రాంతాలను గుర్తించి, ప్రత్యామ్నాయ పంటలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించడం వంటి చర్యలు చేపట్టడం లేదు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులకు ఈ ప్రాంతాలపై అవగాహన లేకపోవడం, వరద సమయంలో హెచ్చరికలు తప్ప మరో మద్దతు అందకపోవడంపై రైతులు విమర్శిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఒత్తిడి తెచ్చేందుకు విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పంటల బీమా ఉంటే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంటల బీమా పథకం అమలులో ఉండేది. అయితే, తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పంటల బీమా పథకాన్ని తిరిగి అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్న రైతులకు ఆర్థిక మద్దతు అందక, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిహారం అందించాలి



ప్రాణహిత వరదలకు పంటలు కొట్టుకుపోయాయి. పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిన నేటికి అధికారులు గ్రామాల వైపు రావడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సర్వే చేసి పరిహారం అందించాలి.

– ఆత్రం వసంత్, రైతు, జిల్లెడ

వందల ఎకరాలు మునిగింది



గతేడాది వందల ఎకరాల్లో పత్తి, వరి పంటలు మునిగిపోయాయి. పంటలు విత్తుకుని మొలకెత్తే, ఎదిగే దశలో వరదలు వస్తే పంటలు కాపాడుకోలేని పరిస్థితి. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న మాకు దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– దోశె తిరుపతి, దిందా, చింతలమానెపల్లి

ముంపు ప్రాంతంగా ప్రకటించాలి



సుంపుటం శివారులో ఎనిమిది ఎకరాలు పత్తి సాగు చేశాను. ప్రాణహిత వరదలో గత నాలుగేళ్లుగా పంటలు మునుగుతూనే ఉన్నాయి. పంటకు నష్టపరిహారం లేదు. లోతట్టు భూములు ముంపు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం పరిహారం అందించాలి.

– కుబిడె తిరుపతి, సుంపుటం

గుండె తరుక్కుపోతుంది



ఆరు ఎకరాల పత్తి సాగుచేసినా. వరదలకు మొత్తం మునిగింది. చేనుకాడికి వచ్చి పంటను చూస్తే గుండె తరుక్కుపోతుంది. దుక్కి కాడి నుంచి విత్తనం ఎరువుల దాక అప్పులు తెచ్చి పెట్టినం. పంటే పోయింది. అప్పు ఎట్ల తీరుతదోనని రందీ పడ్తాన్నం.

– చిన్న లక్ష్మి, సుంపుటం

ఈ సర్కారన్న ఇయ్యాలే



ఐదు ఎకరాల పత్తి సాగు చేసినా. ఈ యేడు కాదు పోయిన నాలుగేళ్ల సంది పంటలు మునుగుతూనే ఉన్నాయి. అప్పట్ల ఆ సర్కారు పరిహారం ఇయ్యాలే. ఎవలైతే పంట నష్టం గూర్చి రాయడానికి అత్తలేరు. ఈ సర్కారు ఎంతో కొంత ఇత్తదని ఆశ ఉన్నది.

– దందెర పెంటయ్య, వేమనపల్లి

బ్లాక్‌మెయిలింగ్ దందా గుట్టురట్టు

- 11 మందిపై కేసు, నలుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్


వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: భారీ బ్లాక్ మెయిలింగ్ గుట్టు రట్టయింది. నెలనెలా లక్షల్లో వసూళ్లు చేస్తూ, డబ్బులివ్వకుంటే చంపేస్తామంటూ వాహన యజమానులను బెదిరింపులకు పాల్పడుతున్న ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాకేంద్రంలోని ఎస్పీ అఖిల్ మహాజన్ తన కార్యాలయంలో శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. తెలంగాణ–మహారాష్ట్ర గుండా వెళ్లే 44వ జాతీయ రహదారిపై అక్రమంగా తరలించే పశువుల వాహనాల వద్ద బ్లాక్ మెయిలింగ్ దందాలకు పాల్పడుతున్నారు. 11 మంది ముఠాగా ఏర్పడ్డారు. మహారాష్ట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ సందీప్, జిల్లా కేంద్రానికి చెందిన రౌడీ షీటర్ రోహిత్ షిండే కీలకంగా ఉన్నారు. పశువులను అక్రమంగా తరలించే వాహనాలను అక్రమంగా తనిఖీ చేస్తూ యజమానులు, డ్రైవర్లను బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూళ్లకు పాల్పడేవారు. డబ్బులు ఇవ్వకపోతే దాడి చేసి పోలీసులకు ఫిర్యాదులు చేస్తామంటూ బెదిరింపులకు గురిచేసేవారు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం అందింది. నేరడిగొండలో నలుగురిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో నేరడిగొండకు చెందిన చేతన్ కుమార్, జంగిలి అన్వేష్, ఇచ్చోడకు చెందిన మసీద్ ఆనంద్, ఆదిలాబాద్‌కు మహ్మద్ మజార్ ఉన్నారని పేర్కొన్నారు. ఏడుగురు పరారీలో ఉన్నారు. మిగతా వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నేరడిగొండ పోలీసుస్టేషన్‌లో 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇచ్చోడ సీఐ రాజు, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


అరెస్ట్ అయిన నిందితులు

అరచేతిలో 'నా పంచాయతీ'



పొట్టపెల్లి పంచాయతీ భవనం

- అందుబాటులోకి యాప్
- నిధుల ఖర్చులో పారదర్శకతకు ప్రాధాన్యత
- ఆదాయ వ్యయాలు తెలుసుకునే అవకాశం

లక్ష్మణచాంద: గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను ప్రజలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయతీ(నా పంచాయతీ) అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ఆదాయ, వ్యయాల్లో పారదర్శకత పాటించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులను పాలకవర్గాలు ఎలా ఖర్చు చేస్తున్నాయనే సమాచారం నేరుగా తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను 2019లో రూపొందించినప్పటికి కొన్ని సాంకేతిక కారణాల వల్ల పూర్తిస్థాయిలో అప్పట్లో అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం సమగ్ర సమాచారంతో అందుబాటులోకి వచ్చింది.

వివరాలు తెలుసుకోవచ్చు

పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులు, వాటి వివరాలను జీపీ అధికారులు ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరుస్తారు. ప్రభుత్వాలు ఏటా ఎన్ని నిధులు మంజూరు చేసింది, ఎంత ఖర్చయింది, తదితర పనులు ఏ దశలో ఉన్నాయో వివరాలు తెలుసుకోవచ్చు. ఈ నిధుల్లో సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు యాప్‌లో నమోదు చేస్తారు. ఇవే కాకుండా వచ్చే ఏడాది అంచనా వ్యయాల నమోదు, గ్రామసభల వివరాలను యాప్‌లో అందుబాటులో ఉంటాయి. వివరాలు నమోదు చేసే సమయంలోనే జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తించే అవకాశం ఉంది. కాగా, మేరీ పంచాయతీ యాప్‌పై విద్యావంతుల్లో కొందరికి తప్ప మిగిలిన వారికి తెలియదని తెలుస్తోంది. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి పల్లెల్లో అవగాహన కల్పించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

డౌన్‌లోడ్ చేసుకోవాలి

స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్‌కు వెళ్లి మేరీ పంచాయతీ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ కావాలి. ఆ వెంటనే ఫైనాన్షియల్ ఇయర్, స్టేట్, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు నమోదు చేయాలి. వాటిని నమోదు చేయగానే పంచాయతీల వివరాలు కనిపిస్తాయి. గ్రామం పేరు, లేదంటే పిన్ కోడ్‌తో పంచాయతీల పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు అంటున్నారు. చేసిన పనుల ఫొటోలను యాప్‌లో పొందుపరుస్తారు.

అవగాహన కల్పించాలి



పంచాయతీల సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు మేరీ పంచాయతీ యాప్ ఉందని చాలా మంది ప్రజలకు తెలియదు. అధికారులు ఈ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి. – సుమన్, ధర్మారం

యాప్‌తో సమగ్ర సమాచారం



మేరీ పంచాయతీ యాప్‌తో పంచాయతీల సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు. పంచాయతీలకు వచ్చే నిధులు, చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌పై పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారు. – శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి, నిర్మల్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సుప్రియ తెలిపారు. కుంటాల మండలం అందకూర్ గ్రామానికి చెందిన బోండ రవి(23), శ్రీకాంత్‌లు శుక్రవారం స్నేహితుడి బర్త్‌డే పార్టీలో పాల్గొనేందుకు బైక్‌పై భైంసాకు వచ్చారు. పార్టీ ముగించుకుని తిరిగి వెళ్తున్నారు. మార్గమధ్యలో రాత్రి ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా చెట్టుకొమ్మ పడింది. బొండ రవి బైక్ డ్రైవింగ్ చేస్తున్న దాన్ని ఢీకొట్టి గాయాలపాలయ్యాడు. వెనుక కూర్చున్న శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్సులో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో బొండ రవి మృతిచెందాడు. మృతుడి తల్లి నీలాబయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

యువకుడిని కాపాడిన పోలీసులు


కడెం ప్రాజెక్ట్ వద్ద రాథోడ్‌వంశీ

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో దూకి ఆత్మహత్య చేసుకుందామని వెళ్లిన యువకుడిని పోలీసులు కాపాడారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్‌వంశీ మండలంలోని డ్యాంగూడకు చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. గతకొన్ని రోజుల నుంచి భార్య కాపురానికి రావడం లేదని శనివారం డ్యాంగూడకు వచ్చిన వంశీ మామతో గొడవపడి మనస్తాపం చెందాడు. ఆత్మహత్యకు చేసుకుందామని ప్రాజెక్ట్ వద్దకు వచ్చాడు. విషయం తెలుసుకున్న వంశీ మామ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై పి.సాయికిరణ్ సిబ్బందిని హుటాహుటిన ప్రాజెక్ట్ వద్దకు పంపించారు. కానిస్టేబుళ్ల భీంరావు, షాకీర్ అతన్ని కాపాడారు. పురుగుల మందు తాగినట్లు చెప్పడంతో అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అమయాకప్రజల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన బంగారి బాలాజీ –రంజనబాయి దంపతుల ఇంట్లో సోదాలు నిర్వహించారు. అదే కాలనీలో దీపక్ ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. వారి వద్ద నుంచి ప్రామిసరీ నోట్లు, సెల్ డీడీలు, బ్యాంకు చెక్‌లు ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి అంత్యక్రియల కోసం రాస్తారోకో

కుభీర్: మండలంలోని బాకోట గ్రామానికి చెందిన మౌనభాయి (70) అంత్యక్రియలు సౌన గ్రామశివారులో చేయడానికి వీల్లేదని సౌన గ్రామస్తులు అడ్డుకున్నారు. శనివారం మౌనభాయి మృతిచెందగా అంత్యక్రియల కోసం పక్కనే ఉన్న సౌన శివారులో గోతిని తవ్వారు. వెంటనే గ్రామస్తులు వచ్చి మా కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలమది ఇక్కడ నిర్వహించేందుకు వీలులేదని అడ్డుకున్నారు. బాకోటలో శ్మశానవాటిక లేదని, గతంలో మేము ఇక్కడే అంత్యక్రియలు చేశామని, ఇప్పుడు కూడా చేస్తామంటూ కొద్దిసేపు రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించడంతో రెండు గ్రామాల మధ్య పొలిమేరలో దహన సంస్కారాలు చేశారు. కాగా, బాకోట గ్రామం రోడ్డు పక్కన ఉంది. సౌన గ్రామం బాకోట నుంచి అర కిలో మీటర్ దూరంలో ఉంది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: స్థానిక గర్మిళ్ల సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి(55) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. శనివారం తమకు అందిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. బ్లూకలర్ లుంగి ధరించి ఉన్నాడు. కుడిపక్కన ఛాతీపై ఒక పుట్టుమచ్చ ఉంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలకు 8712658596, 8328512176 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మొక్కలు నాటుతున్న ఐటీడీఏ పీవో దంపతులు

తలమడుగు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని బరంపూర్ సమీపంలోని కొండపై శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భర్త దీపక్ తివారి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం పూజలు నిర్వహించారు. వన మహోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ విశాలమైన వాతావరణం చుట్టుపచ్చని కొండలు మనసుకి ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, పూజారి స్వస్తిక్, స్వామి కమిటీ సభ్యులు బి.మల్లేశ్, రాజు రమాకాంత్ ఉన్నారు.

'సాహితీ విపంచి' ఆవిష్కరణ


సాహితీ విపంచి సంపుటిలతో కవులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం సాహితీ విపంచి సంపుటి-6ను కవి అన్వర్ అవిష్కరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 125 మంది కవులు రచించిన సంపుటి పద్యవిభాగంలో 25 గేయ విభాగంలో 77 కవితలు రాయటం జరిగింది. ఈసందర్భంగా అన్వర్ మాట్లాడుతూ సాహితీ సంస్థ ఏర్పాటు చేసి 17 సంవత్సరాలుగా ప్రతీ మాసంలో రెండు సాహితీ కార్యక్రమాలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. కవులు మలయశ్రీ, ఐవీ సుబ్బాయమ్మ, సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు అనంద్‌రావు, మహిళా కార్యదర్శి శ్రీలక్ష్మి, శ్రీనాథ్‌గౌడ్ సాహితీ విపంచి పుస్తక సమీక్షించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన కవులను శాలువాలతో సత్కరించి సాహితీ విపంచి సంపుటిని అందజేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పట్వర్దన్, అధ్యక్షుడు వామన్‌రావు, కవులు చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సంతోష్ పాల్గొన్నారు.